# సత్యవాక్కు

సంపుటి - 42 ఫిబ్రవరి - 2021 సంచిక - 7

Feb '21

## క్రైస్తవ మాసపత్రిక

ఫిబ్రవరి - 2021

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ ఛానల్‌లో |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ ఛానల్‌లో |
| శుక్రవారం ఉదయం | : | 6.30 గంటలకు MAHAA NEWS ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 గంటలకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 గంటలకు కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 గంటలకు కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanicoc.kkd లో**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్యు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 ఫిబ్రవరి - 2021 సంచిక -7


## పరలోక ప్రార్ధన

మనుష్యులు విసుగక నిత్యము ప్రార్ధన చేయుచుండవలెనని యేసు లూకా 18:1లో బోధించెను. యేసు ప్రార్ధనలోని శక్తిని తన జీవితములో నిరూపించెను. ప్రార్ధనాపరులైన ప్రజలు నిజముగా భక్తిపరులై యుందురు. యేసు పాపము లేనివాడు, దేవుని కుమారుడు, దేవునితో సమానుడే అయినను ప్రార్ధనలో ఎక్కువ సమయము ను ఆయన వెచ్చించెను.

యేసు బాప్తిస్మము పొంది ప్రార్ధన చేసెను. బహిరంగ సువార్త సేవ చేసిన కొద్ది కాలములోను యేసు ప్రార్ధనలో ఎక్కువ కాలము గడిపెను సిలువ నీడలో నిలబడుచు గెత్సెమనె వనములో తన ముఖము మీది చెమట బిందువులు రక్తబిందువులుగా మారు నంతమట్టుకు ఆయన ప్రార్ధన చేసెను. మనము కూడ అన్ని వేళలందును ప్రార్ధించవలెను. ప్రార్ధన గొప్ప కార్యములు చేయునప్పుడు మాత్రమేకాదు లేదా మనము గొప్ప ఆపదలో యున్నప్పుడు మాత్రమే కాదు గాని మనము ఎడతెగక నిత్యము ప్రార్ధన చేయవలెనని యేసు బోధించెను.

కొంతమంది మత్తయి 6వ

అధ్యాయములో యున్న "ప్రభువు ప్రార్థనను" పదేపదే వల్లించెదరు. 9-13 వరకున్న వచనములలోని ఆప్రార్థనను తెలుగువారు పరలోక ప్రార్థన అనికూడ పిలుచుచుందురు.

అది ఒకమాదిరి ప్రార్థన. దానిని యేసు ఇట్లు నేర్పించెను : "కాబట్టి మీరీలాగు ప్రార్థనచేయుడి. పరలోకమందున్న మా తండ్రీ, నీనామము పరిశుద్ధ పరచబడు గాక; నీ రాజ్యము వచ్చునుగాక! నీ చిత్తము పరలోకమందు నెరవేరు చున్నట్లు భూమియం...ను నెరవేరును గాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా ఋణస్థు లను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము. మమ్ము ను శోధనలోకి తేక దుష్టుని నుండి మమ్మును తప్పించుము".

యేసు ప్రార్థనను గూర్చి బోధించుచు మీరీలాగు ప్రార్థన చేయుడి అని చెప్పిన సంగతిని బట్టి అయన...్పిన ఈ ప్రార్థన ఒక మాదిరి ప్రార్థనయని గమనించుదాము. అంటే మనము అందులోని పదములను పదే పదే వల్లించవలెనని ఆయన ఉద్దేశము కాదు. అందుకే "మీరు ప్రార్థన చేయు నప్పుడు అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు" అని ఆయన బోధించెను. యేసు నేర్పిన ఆ ప్రార్థన లోని మాటలనే వచించున్న యెడల అది వ్యర్థమని మనము గ్రహించవలెను. 'మీరీలాగున ప్రార్థన చేయుడి' అని ఆయన చెప్పెను గనుక ఆ ప్రార్థనలోని అంశముల నొక్కొక్క దానిని మనము ఇప్పుడు వివరముగా చూస్తు దీని నుండి మనము నేర్చుకొన దగిన పాఠములను నేర్చుకొందాము.

"పరలోకమందున్న మాతండ్రీ" అను పదములతో ఆప్రార్థనను యేసు ఆరంభించెను. ఈ మాటలలో దేవుడు సృష్టికర్తయని, ఈలోకాన్నంతటిని పరిపాలించు గొప్ప అధికారియని మాత్రమే గాక అయన బిడ్డలమైన మనకు ఆయన తండ్రియై యున్నాడని మనము గుర్తించవలెను. అందుకే

"దేవుడు లోకము నెంతో ప్రేమించెను, కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" అని యేసు బోధించెను (యోహాను 3:16). దేవుడు మన తండ్రియని ఎప్పుడైతే ఒప్పుకొందుమో అప్పుడే యేసు దేవుని కుమారుడని కూడ మనము ఒప్పుకొందుము.

ఎవడైనను యేసు దేవుని కుమారుడని విశ్వసించని యెడల వాడు దేవుని కుమారుడు కాడని క్రొత్త నిబంధన బోధించుచున్నది. "తన్ను ఎంద రంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాస ముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెనని" యోహాను 1:12లో వ్రాయబడి యున్నది. దేవుడు మన తండ్రి, యేసు ఆయన అద్వితీయ కుమారుడు, మనము ఆయన దత్తపుత్రులము అని దైవవేదము బోధించుచున్నది. "దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు. ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదుగాని దత్తపుత్రాత్మను పొందిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము అబ్బా, తండ్రీ అని మొర్ర పెట్టుచున్నాము" అని రోమా 8:14, 15లో అపో.పౌలు వ్రాసెను.

**"నీ నామము పరిశుద్ధపరచబడును గాక" యను మాటలు దేవుని నామము** పూజింపబడదగినదని సూచించు చున్నవి. దేవుడొక్కడే పూజింపబడ దగినవాడు. కీర్తన 111:9లో "ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింప దగినదని" వ్రాయబడి యున్నది. ఇంగ్లీషు బైబిలులో రెవరెండ్ అను పదము ఇక్కడ ఒక్కసారే వినియోగించ బడినది. అది దేవునికి వర్తించును. ఈనాడు మానవులు 'రెవరెండ్' అను బిరుదును తగిలించుకొనుట దేవుని స్థానమును ఆక్రమించుకొనుటయే, దేవుడొక్కడే పూజింపబడ దగినవాడు మానవుడు కాడు.

"నీ రాజ్యము వచ్చుగాక" యని యేసు తనవారిని ప్రార్థనలో నేర్పించెను, బాప్తిస్మమిచ్చు యోహాను, యేసుకూడ దేవుని రాజ్యము ఆసన్నమై యున్నదని బోధించేవారు. అప్పటికింకా దేవుని రాజ్యము స్థాపించబడలేదు. అది యింకా భవిష్యత్తులో యున్నది గనుక వారు దానిని గూర్చి ప్రార్థించ వలెనని యేసు నేర్పించెను. అయితే క్రీస్తు చని పోయి, తిరిగి లేచిన తరువాత మొదటి పెంతెకోస్తు దినమున దేవుని రాజ్యము లేక దేవుని సంఘము యెరూషలేములో మొట్టమొదట స్థాపించబడెనని అపొ. కా. 2వ అధ్యాయము మనకు బోధించు చున్నది. ఆరోజు పేతురు క్రీస్తు రాజ్య సువార్తను బోధించగా ఇంచుమించు మూడువేలమంది విని, విశ్వసించి బాప్తిస్మముపొంది ఆరాజ్యములో చేర్చ బడిరి. నాటినుండి నేటివరకు ఎవరైతే క్రీస్తు అధికారమును ఒప్పుకొని ఆయన సువార్తకు లోబడుదురో వారినందరిని ప్రభువు తన రాజ్యములో లేక సంఘములో చేర్చుచున్నారు.

క్రీస్తు ప్రార్థించుమని చెప్పిన రాజ్యము వచ్చేసింది. గనుక మనము దానికొరకు 'అది వచ్చునుగాక' యని యిప్పుడు ప్రార్థించినయెడల అది అర్థ రహితముగా యుండును. దేవుని రాజ్యము స్థాపించబడి యిప్పుడు ఉన్నది. గనుక ఆయన రాజ్యము దిన దినము విస్తరించునట్లు ఇప్పుడు మనము ప్రార్థించవలెను. సరిగదా, దాని కొరకు మనము పాటుపడవలెను.

"నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమి యందును నెరవేరునుగాక" యనునప్పుడు భూమి మీదనున్న మానవులు ఆయన ఆజ్ఞలకు లోబడునట్లు మనము ప్రార్థించు చున్నాము. దేవుని చిత్తమే దేవుని చట్టము. ముందు మనము దేవుని ఆజ్ఞలకు లోబడి, యితరులుకూడ లోబడగల్గునట్లు మనము ప్రార్థించు చున్నాము. దేవుని చిత్తమే దేవుని చట్టము. ముందు మనము దేవుని ఆజ్ఞలకు లోబడి, యితరులుకూడ లోబడగల్గునట్లు చూడవలెను.

"మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము"అనునప్పుడు మన దైనిక ఆహారముకొరకు మనము దేవునికి విజ్ఞాపనము చేయుచున్నాము. మానవుని ఆహారము కొరకు మానవుడు దేవుని ప్రకృతి సూత్రములకు లోబడి పనిచేయవలెను. మానవుడు విత్తనములు విత్తగా వాటిని ఫలింప జేయువాడు దేవుడే. అయితే ఏపనియు చేయని సోమరిని దేవుడు అద్భుతరీతి గా మాత్రము పోషింపడు. ప్రతి మానవుడు తన అనుదినాహారము కొరకు కష్టపడి పనిచేయవలసినదే.

"మా ఋణములను క్షమింపుమని" దేవుని అడుగుచున్నప్పుడు మనము ఆయన ఆజ్ఞలను మీరి పాపము చేసితిమని ఒప్పుకొనుటయే గాక ఆయన మనలను క్షమించునట్లు విజ్ఞాపన చేయుచున్నాము. మనము ఆయన యెడల నేరము చేయగా ఆయన మనలనెట్లు క్షమించునో అట్లే మనయెడల నేరము చేసిన వారిని మనము క్షమించుటకు సిద్ధముగా యుండవలెనని యేసు ఈ మాదిరి ప్రార్థనలో బోధించెను.

"మమ్మును శోధనలోకి తేక దుష్టుని నుండి తప్పించుము" అను మాటలలో దేవుడు మనలను శోధనలో నికి తెచ్చునని యర్థము లేదు, సరిగదా, ఆయన ఎవనిని శోధింపడు అని లేఖనములు చెప్పుచున్నవి (యాకోబు 1:13). మనలను శోధించువాడు అపవాది, "కాబట్టి దేవునికి లోబడి యుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ యొద్దనుండి పారి పోవును" అని యాకోబు 4:7లో వ్రాయబడియున్నది.

మనము ప్రార్థించునప్పుడు దేవుని శక్తిపై ఆధారపడి ప్రార్థించ వలెను. యేసు నేర్పిన ఈ మాదిరి ప్రార్థన సంక్షిప్తమైన ప్రార్థన. దానిని మనము ప్రతిచోట వల్లించుటకన్న దానిలోని తలంపులననుకరించి మన ప్రార్థనలను చేయుట అవసరము. ప్రభువు నేర్పిన ఈ ప్రార్థన కేవలము మాదిరి ప్రార్థనయే. మీరీలాగు

చేయుడి అని ఆయన చెప్పెను. గాని మీరీ ప్రార్థననే చేయుడి అని చెప్పలేదు. ఆ ప్రార్థనలో ఒక అంశమగు దేవుని రాజ్యము వచ్చేసింది. గనుక అది వచ్చునట్లు మనము ప్రార్థించుటలో అర్థమేమియును లేదు. దేవుని రాజ్యము లేక సంఘము స్థాపించబడిన తరువాత మనము సమస్తమును క్రీస్తు పేరట చేయవలెనని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు: "మరియు మాటచేతగాని, క్రియచేత గాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి"యని కొలస్స 3:17లో వ్రాయబడి యున్నది. తండ్రి యైన దేవుని సన్నిధానములో మన ప్రార్థన విజ్ఞాపనలు విన్నబడవలెనన్న అవి క్రీస్తునామమున పంపించబడ వలెను. ప్రభువు నేర్పినమాదిరి ప్రార్థన క్రీస్తు నామమున చేయబడలేదు. "దేవుడొక్కడే, దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తు యేసు... ...రుడు" (1తిమో. 2:5). ఆయా కారణముల వలన క్రైస్తవులు యేసు నేర్పిన మాదిరి ప్రార్థనను ప్రార్థించ నవుసరము లేదు.

అయితే నీవు దేవుని ప్రార్థించుట అత్యవుసరము. క్రీస్తు నందు విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది క్రైస్తవుడవుకమ్ము. దేవునితో తండ్రి కుమారుల సంబంధ మును ఏర్పరచుకొని క్రీస్తుద్వారా నీ విజ్ఞాపనలను ఆయనకు తెలియ జేయుము. అప్పుడు ఆయన నీ మొరరలను వినగలడు!!


**ఉచిత బైబిలు కోర్సు**

**మీ యింటిలోనే ఉండి బైబిలు సత్యములను తెలిసికొనండి. మేమిచ్చు బైబిలు కోర్సులో చేరండి. పోస్టుద్వారా ఆ పాఠములను ఉచితంగానే పొంది దానిని పూర్తిచేయగానే ఒక బైబిలు గ్రంథమును ఉచితముగా పొందండి. దిగువ అడ్రసుకు నేడే వ్రాయండి.**

**సత్యవాణి**

పోస్ట్ బాక్స్ నెం. 80,
కాకినాడ - 533 001.
ఫోన్ : 0884 - 2363722

# కానుకలిచ్చుట

కానుకలిచ్చుట క్రైస్తవుని యొక్క ముఖ్య బాధ్యత మరియు ఆశీర్వాదము. యేసుక్రీస్తు సిలువ పై మన కొరకు మరణించుట అన్నిటికంటే ప్రాముఖ్యమైన యీవి (కానుక)యై యున్నది. మార్కు 12:41-44లో ఇచ్చుటలో యున్న గొప్ప మాదిరిని మనము చూడగలము. దేవాలయపు కానుకల పెట్టెలో ప్రజలు కానుకలు వేయుట యేసు గమనించు చుండెను. ఒక బీద విధవరాలు వచ్చి దానిలో రెండు కాసులు వేసెను. అది ఆ రోజుల్లో యున్న నాణెములలో అత్యల్పమైనది. ఈ రోజులలో దాని విలువ యేమీ వుండదు. అయినను ఆ బీద విధవరాలు అందరి కంటె ఎక్కువ యిచ్చెనని యేసు చెప్పెను. ఏలయనగా వారందరు తమకు కలిగిన సమృద్ధిలో నుండి వేసిరి గాని యీమె తన లేమిలో తనకు కలిగిన దంతయు అనగా తన జీవనమంతయు వేసెనని ఆయన చెప్పెను.

**ఇచ్చుటలో ఉద్దేశ్యము**

మనం ఎందు నిమిత్తము ఇచ్చుచున్నామో దేవునికి ముఖ్యము. మొదటిగా కాని ఉద్దేశ్యముతో ఇచ్చువారిని గమనించుదాము. అది మన బాధ్యత యని గాక, పేరు కొరకు, గొప్ప కొరకు మనుష్యులచే పొగిడించుకొనుటకు ఇయ్యరాదు. ఏదైనా వ్యక్తిగతంగా చేయవలసి వచ్చినప్పుడు కొంచెం డబ్బు ఇచ్చేస్తే సరిపోదు. దేవుని సేవించుటకు మనకు బదులుగా ఇంకొకరిని కూలికి పెట్టుకోలేము.

క్రైస్తవుడు విశ్వాసము వలన, ప్రేమ వలన, భక్తి వలన దేవునికిస్తాడు. ఇచ్చుట ద్వారా దేవుని యెడల మన ప్రేమను వెల్లడి పరుస్తాము. మనము ఇచ్చుచు ఎదుగుదుము. మనం ఉదారముగా ఇచ్చుకొలది దేవుని స్వభావములో పాలి భాగస్థులమగుదుము. ఇచ్చుట ద్వారా దేవుడు మనలను దీవించుటకు మార్గము సుగమముగును. చివరిగా క్రీస్తు రాజ్యమైన సంఘము

అభివృద్ధి చెందు నిమిత్తము మనము యిత్తుము. సంఘము యొక్క అనేక అవుసరముల కొరకు ధనము అవుసరము. దేవుని బిడ్డలు ఆయన పనిని ఆర్థికంగా ప్రోత్సహించవలెనను నది దేవుని యొక్క సంకల్పము.

**1 కొరింథీ 16:1-2**

"పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘము లకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్థిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" అని అపో.పౌలు వ్రాసాడు.

ఈ లేఖన భాగములో కొంత సొమ్ము నిలువ చేయవలెననే ఆజ్ఞ యున్నది. సంఘము కూడియున్నప్పుడు, ఆదివారమున చందా పోగుచేయ వలెనని చెప్పబడినందున అది సంఘమునకిచ్చిన చందాయని మనము గ్రహించవలెను. ఆ పోగు చేయబడడం ఇంటి వద్దనే అయితే అది ఎప్పుడైన జరిగించవచ్చును. గాని యిది సంఘము ఆదివారమున కూడి యున్నప్పుడు జరిగించవలెను.

యిది ప్రతి వ్యక్తికి ఈయబడిన ఆజ్ఞ. ప్రతివాడు దీనిలో పాలుపొంద వలెను. ధనికులు, పెద్దవారే కాదు అందరు ఇయ్యాలి.

మనము నిలువ చేయవలెను. యిది డబ్బు మాత్రమేయని మనం తలుస్తాము గాని మనకున్నది ఏదైనా నిలువ చేయవచ్చును. తన యొద్ద యున్నది కొంచెము మాత్రమే గనుక ఇయ్యనక్కరలేదని తలంచరాదు. డబ్బు మాత్రమే ఇయ్యాలని బైబిలు ఎన్నడు చెప్పలేదు.

మనము అభివృద్ధి జెందిన కొలది ఇయ్యాలి. మనం ఇంత ఇయ్యాలని దేవుడు వ్యక్తపరచలేదు. యూదులు దశమభాగము నియ్యవలె నని ఆజ్ఞాపింపబడిరి. అయినను వార ర్పించే అనేక బలులను కూడ పరిగణిస్తే వారు దశమభాగము కంటే ఎక్కువే

యిచ్చారు. అయితే మనకున్నది వారి కంటే శ్రేష్టమైన నిబంధన, శ్రేష్టమైన రక్షకుడు. గనుక మనం వారి కంటే తక్కువ ఎందుకియ్యాలి? ఇక్కడ ముఖ్యమైనదేమంటే ఇతరులతో మనం పోల్చుకోరాదు. ఇచ్చుట వ్యక్తిగతమైనది. గనుక యితరులతో మనం పోల్చుకొనుచు ఇయ్యరాదు.

తదుపరి వారు చందాను పోగు చేయవలెను. పౌలు వారి యొద్దకు వచ్చినప్పుడు గాక ప్రతి ఆదివారమున వారు చందా నీయవలెను. పౌలు కొరింధు సంఘముకు వచ్చుసరికి వారు చందాను పోగు చేసియుండవలెను. అనగా ఏదైనా అవసరం వచ్చుసరికి ధనము సిద్ధపాటు చేయబడి యుండును గాని అవసరం వచ్చిన తరువాత దానిని సిద్ధపరచుట కాదు.

**2 కొరింథీ 9:5-7**

"కావున లోగడ ఇచ్చెదమని మీరు చెప్పిన ధర్మము పిసినితనముగా ఇయ్యక ధారాళముగా ఇయ్యవలెనని చెప్పి సహోదరులు మీ యొద్దకు ముందుగా వచ్చి దానిని జమచేయుటకై వారిని హెచ్చరించుట అవసరమని తలంచితిని. కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయునని యీ విషయమై చెప్పవచ్చును" (2కొరింథీ 9:5-7).

మనం ఇష్టపూర్వకంగా, ఉత్సాహముగా ఇయ్యాలి. మనం బలవంతముగా ఇస్తే దేవుడు హర్షించరు. ప్రేమపూర్వక భావముతో మనం ఇయ్యాలి. ఇచ్చుట భారమని తలంచరాదు. కొన్ని సంఘములు తమ సభ్యులను ఇచ్చుటకు బలవంతము చేతురు. వారు ఇంత యిస్తామని ప్రమాణము చేయించుకొందురు. నెల అయ్యేసరికి ఆ సొమ్ము నిమిత్తము ఒక బిల్లును వారికి పంపుదురు. అందువలన ఇచ్చుట ఉత్సాహముగా జరగదు. అది వారికి కష్టతరముగా యుండును.

మనం హృదయంలో నిశ్చయించుకొనిన కొలది ఇయ్యాలి.

అనగా మనం ఇచ్చుటకు ముందే ఆలోచించుకొని ఎంత ఇయ్య వలెనో నిశ్చయించుకోవాలి. అన్నిటి కంటే ముందుగా దేవునికి ఎంత ఇయ్యాలో నిశ్చయించుకోవాలి. తదుపరి మిగతా సంగతులను గూర్చి ఆలోచించాలి. మన ఆదాయంలో ముందు దేవునికిచ్చుటకు నిశ్చయించుకొని మిగిలిన సొమ్మును గూర్చి తదుపరి ఆలోచించాలి.

ఈ లేఖనం మనలను ఇచ్చుటకు ప్రోత్సాహించును. దేవునికిచ్చుట ఒసం భారమని తలంచరాదు, ఏలయనగా దేవుడు మనం ఇచ్చిన దాని కంటే ఎక్కువ యిచ్చెదనని వాగ్దానం చేసారు. దుర్లాభాపేక్ష వలన మనం ఇయ్యరాదు. దేవునికిస్తే ఆయన ఎక్కువ యిస్తారనే దురాశతో మనం ఇయ్యరాదు. మనం యిచ్చుచుండగా దేవుడు దీవిస్తానని వాగ్ధానం చేసారు. టి.వి.లో మాట్లాడు బోధకులు ఈ లేఖన భాగమును దుర్వినియోగం చేయు.. డబ్బు దండుకొన యత్నించుదురు. ప్రేక్షకులు వారికి కొంత డబ్బును (విత్తన) మనీగా పంపితే వారి అవుసరములన్నీ తీరేటంత డబ్బు దేవుడు వారికిస్తాడని వారు చెబుతారు. యిది కేవలం లేఖన విరుద్ధము; దురాశను రేకెత్తించు భావమును వారు కలుగజేయుదురు. మనం మంచి పనులు చేయుటకు దేవుడు సహాయము చేయునని 2 కొరింథీ 9:8-10 చెప్పుచున్నది.

## మనం యిచ్చు మొత్తము ముఖ్యము కాదు

"మొదట ఒకడు సిద్ధమైన మనస్సు కలిగి యుంటే శక్తికి మించి కాదుగాని కలిమి కొలదియే యిచ్చినది ప్రీతికరమగును" (2 కొరింథీ 8-12). ఇంకొక మాటలో మనం యిచ్చే కానుక యొక్క మొత్తమును ఆయన చూడరు. గనుకనే మన కానుకలను యితరులతో పోల్చుకోరాదు. ఒకని సామర్థ్యమును దేవుడు పరిగణిస్తాడు. దానిని దేవుడు మాత్రమే నిశ్చయించగలరు.

**ఇచ్చుట వలన కలుగు ఫలితములు**

మొదటిగా సంఘము యొక్క అవసరములు తీరును. సంఘావసర ముల నిమిత్తము డబ్బు కొరకు రకరకాల కార్యక్రమములు, వ్యాపార ములు జరిగించాలని లేఖనములు చెప్పుట లేదు. సభ్యులు డబ్బు ఇయ్యాలని తరుచు వారికి విన్నవించు ట తగదు. టి.వి. బోధకులు పదే పదే డబ్బు కొరకు విజ్ఞాపనలు చేస్తారు. అది తగదు. సంఘము యొక్క పని సంఘ సభ్యులు చేత భరింపబడాలి.

ఇచ్చుట వలన కృతజ్ఞత పెరు గును, దేవునికి మహిమ కలుగును. సంఘము యొక్క పరిచర్యలు సంపూర్తి యగుటను యితరులు చూచునప్పుడు, అది మన పనియొక్క నిదర్శనమగును. దేవుని ఆజ్ఞకు మనం లోబడుచున్నందు న దేవుడు మహిమ పరచబడును. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి" యని అందుకే యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 5:16).

ఇచ్చుట వలన సంఘము, మనము కూడ అభివృద్ధి జెందుదుము, మనం ఇయ్యగలిగినంత సొమ్ము యిస్తే సంఘము తలపెట్టిన పనులు నిర్వర్తిం చగలుగును. తద్వారా యితరులు కూడ క్రీస్తులోనికి మార్చబడుదురు. అనేక ప్రాంతమములకు సువార్త వెదజల్ల బడును, ఏ పనిచేయని సంఘములో ఉండుటకు ఎవ్వరు ఇష్టపడరు. సంఘము పనిచేయుట చూచుచుండగా దేవుడు మహిమ పరచబడును. సత్క్రియలు జరిగించు సంఘములో సభ్యులుగా యుండుటకు అనేకులు ఆసక్తి చూపుదురు.

**- జెర్రీ బేట్స్**



# సమరయులు సువార్తకు లోబడుట

స్తెఫనును రాళ్లు రువ్వించంపుటకు సౌలు తన సమ్మతిని తెలియజేసాడు. న్యాయవిచారణ యేమీలేకుండా ఆ సువార్తికుని హత్యగావించబడెను. సౌలు ఆ అదను చూచుకొని యెరూషలేములో యున్న క్రైస్తవులపై దాడులు ప్రారంభించాడు. అతడు వారి యిండ్ల లోనికి జొచ్చి పురుషులను, స్త్రీలను బంధించి చెరసాలలో వేయించు చుండెను.

అప్పటికి యెరూషలేములో 5 వేలకు మందికిపైగా యున్న వారు అటు యిటు చెదరిపోయిరి. ఫిలిప్పు యెరూషలేము సంఘములో పరిచారకులలో ఒకనిగా పనిచేసాడు. (అపొ. కా. 6:1-7; 1తిమో3:8-13). సంఘము చెదరిపోయినందున పరిచారకుని పని ఇప్పుడతనికి యేమీ లేదు.

గాని ఫిలిప్పును ఇతరులును తమ విశ్వాసమును విడనాడలేదు, ప్రభువును సేవించుటమానలేదు, "కాబట్టి చెదరిపోయిన వారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" (అపొ.కా. 8:4; ఫిలిప్పీ 1:12). సువార్త వాక్యము ద్వారా రక్షణ పొందిన ప్రతివాడు అదే వర్తమానాన్ని యితరులకు బోధింపబాధ్యుడై యున్నాడు (మత్తయి 28:18-20; మార్కు 16:15-16). "అప్పుడు ఫిలిప్పు సమరయ పట్టణము వరకును వెళ్లి క్రీస్తు సువార్తను వారికి ప్రకటించు చుండెను, జనసమూహములు ఫిలిప్పు చేసిన సూచక క్రియలను చూచి నందున అతడు చెప్పిన మాటల యందు ఏక మనస్సుతో లక్ష్యముంచగా అనేకులకు పట్టిన అపవిత్రాత్మలు పెద్దకేకలు వేసి వారిని వదలి పోయెను. పక్షవాయువు గల వారును, కుంటివారును అనేకులు స్వస్థతపొందిరి, అందుకు ఆ పట్టణము లో మిగుల సంతోషము కలిగెను" (అపొ.కా. 8:4-8).

సమరయ పట్టణస్థులు గారడీ చేయుచున్న ఒక మనుష్యుని యందు గొప్పగా లక్ష్యముంచిరి. అయితే వారు ఫిలిప్పు చెప్పిన మాటలను, చేసిన సూచక క్రియలను చూచి గారడీ వాడైన సీమోను దగ్గర నుండి తొలగిపోయిరి. "అయితే వారు ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి, పురుషులను, స్త్రీలును బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 8:12). యేసుతో బావి యొద్ద సంభాషించిన స్త్రీ కూడ వారిలో ఉండి యుండవచ్చును.

ఫిలిప్పు క్రీస్తును గూర్చియు ఆయన నామమును గూర్చియు దేవుని రాజ్య మును గూర్చియు బోధించినప్పుడు బాప్తిస్మమును గూర్చి కూడా బోధించా డు. అందువలన ప్రజలు బాప్తిస్మము పొందిరి. అపొ.కా. 2వ అధ్యాయములో యూదులు ఎట్లు బాప్తిస్మము పొందారో వారును అట్లే చేసిరి. వారు పాప క్షమాపణ నిమిత్తము క్రీస్తునామమున నీటిలో ముంచబడగా దేవుడు వారి పాపములు క్షమించి వారిని రక్షించెను (అపొ.కా. 2:38; 8:35-39; 22:16; రోమా 6:3-4). "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరును క్రీస్తును ధరించుకొనియున్నారు; యేసు క్రీస్తునందు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారని" పౌలు గలతీయులకు తెలియజేసెను (గలతీ 3:26, 27).

ఈ రోజుల్లో సువార్త బోధించుచుండగా పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలనే ప్రభువు హెచ్చరికలను, సువార్తికుని ద్వారా వినుచున్నావా? ఫిలిప్పు సమరయులకు ఏ సువర్తమానము బోధించెనో దానినే నేడు మనమును బోధించాలి. అప్పుడు అదే రకమైన ఫలితము లభించును. "ఏలయనగా నమ్ము ప్రతివానిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16).

**-రోయస్ ఫ్రెడరిక్**

# ద్రాక్షావల్లి, తీగలు

“నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసి పారవేయును; ఫలించు ప్రతి తీగ మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసిపారవేయును. నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నాయందు నిలిచి యుండుడి, మీ యందు నేనును నిలిచి యుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే గాని తనంతట తానే యేలాగు ఫలింపదో ఆలాగే నాయందు నిలిచి యుంటేనే గాని మీరును ఫలింపరు.

“ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచి యుండునో నేను ఎవని యందు నిలిచి యుండునో వాడు బహుగా ఫలించును, నాకు వేరుగా యుండి మీరేమి చేయలేరు. ఎవడైనను నా యందు నిలిచి యుండని యెడల వాడు తీగ వలె బయట పారవేయబడి యెండి పోవును. మనుష్యులు అట్టి వాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును. నాయందు మీరును మీ యందు నా మాటలను నిలిచి యుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి; అది మీకు అనుగ్రహింపబడును. మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమ పరచబడును, అందు వలన మీరు నాకు శిష్యులగుదురు” (యోహాను 15:1-8).

ఈ లేఖన భాగములో యేసు వాడిన దృష్టాంతము పాతనిబంధన లేఖనములలో కూడ పలుమార్లు కన బడును. ఐగుప్తులోనుండి ఆయన తోడుకొని వచ్చిన ప్రజలు ఆయన ద్రాక్షవల్లియని చెప్పబడినది. ఆయన వారిని తోడుకొని వచ్చి ఆయన జనాంగములను పారద్రోలి కానానులో నాటెను (కీర్తన 80:8-11). “ఇశ్రాయేలు వంశము సైన్యములకధి

పతియగు యెహోవా ద్రాక్షతోట, యూదా మనుష్యులు ఆయన కిష్టమైన వనము" (యెషయా 5:7). ఇదే విధమైన దృష్టాంతము యిర్మీయాలోను యెహెజ్కేలులోను కనబడును, అయినను ఆ ప్రజలు ఆయనకు అవిధేయులైరి.

"శ్రేష్టమైన ద్రాక్షావల్లి వంటి దానిగా నేను నిన్ను నాటితిని. కేవలము నిక్కమైన విత్తనము వలన చెట్టువంటి దానిగా నిన్ను నాటితిని; నాకు జాతి హీనపు ద్రాక్షావల్లి వలె నీవెట్లు భ్రష్ట సంతానమైతివి?" (యిర్మీయా 2:21). ఫలములు ఫలించుటయే ద్రాక్షావల్లి యొక్క ప్రయోజనము. అది ఫలించని యెడల అది అగ్నిలో పారవేయబడి కాల్చివేయబడును. యెహెజ్కేలు 15: 1-8లో యున్న తలంపుకూడ అదియే.

పాత నిబంధనలో దేవుని ప్రజలు ఆయన ద్రాక్షాతోటయై యున్నారు. యేసు వాక్యమైన దేవుడై ఆది నుండి యున్నవాడు (యోహాను 1:1). దేవుడు ద్రాక్షావల్లి యొక్క యజమాని. ఆయన శరీర ధారియైనప్పుడు "నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయ కుడు అని చెప్పెను (యోహాను 15:1). "నేను ద్రాక్షావల్లిని మీరు నా తీగెలు" అని కూడ ఆయన చెప్పెను (యోహాను 15:5). క్రైస్తవులు ద్రాక్షావల్లిలో యున్నారు. ఏలయనగా వారు క్రీస్తులో యున్నారు (గలతీ 3:26,27; రోమా 6:3,4).

తీగెల యొక్క జీవము ద్రాక్షావల్లి నుండి వచ్చును. తీగెఫలములు ఫలిం చాలంటే ద్రాక్షావల్లిలోనే యుండాలి. మనము దేవుని మహిమ కొరకు ఫలములు ఫలించాలంటే క్రీస్తులో నిలిచి యుండాలి. అందువలననే. "ఎవడు నాయందు నిలిచి యుండునో నేను ఎవని యందు నిలిచి యుండునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరు. ఎడవైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగవలె

బయటపార వేయబడి యెండిపోవును. మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు" అని యేసు చెప్పెను (యోహాను 15:5,6).

ఫలములు ఫలించుటే ద్రాక్షావల్లి యొక్క ప్రయోజనము. అది సహజముగా ఫలములు ఫలించును. క్రీస్తు నందున్న వారు ఒక క్రొత్త జన్మను అనుభవించారు. వారు క్రొత్తవారు, గతంలో కంటే ఇప్పుడు క్రొత్తతత్వము గలవారు. "అందువలన ఎవడైనను క్రీస్తు నందున్న యెడల వాడు నూతనసృష్టి; పాతవి గతించెనో ఇదిగో సమస్తమును క్రొత్తవాయెను" అని చెప్పబడినది (2 కొరింథీ 5:17). క్రైస్తవుడు దేవస్వభావ మందు పాలిభాగస్థుడు (2పేతురు 1:3-4).

అయన అజ్ఞాపించిన వాటన్నిటికీ విధేయత చూపుటయే ఆయనకు ఫలములు ఫలించుటయగును. యిది అనేక లేఖనభాగములలో మనకు వివరించబడినది. "అయితే ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వీకము, ఆశానిగ్రహాము. ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు" (గలతీ 5:22,23). కొలస్సయలో యున్న క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసాడు: "మీరు సంపూర్ణ జ్ఞానమును, ఆత్మసంబంధమైన వివేకము గలవారును, ఆయన చిత్తమును సంపూర్ణముగా గ్రహించినవారై ప్రతిసత్కార్యములలో సఫలులగుచు ఆయనకు తగినట్లుగా నడుచుకొనవలెనని... తండ్రికి మీరు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెననియు దేవుని బతిమలాడుచున్నాము" (కొలస్స 1:9,10).

సువార్త ప్రకటించుట ద్వారా ఆత్మలను సంపాదించుట ఫలములు ఫలించుటలో ముఖ్యభాగము. రోమాలో యున్న క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసాడు: "సహోదరులారా, నేను ఇతరులైన అన్యజనములలో ఫలము పొందినట్లు మీలో కూడ ఫలమే దైనను

పొందవలెనని అనేక పర్యాయములు మీ యొద్దకు రానుద్దేశించితిని" (రోమా 1:13). పౌలు తన జీవితమును సువార్త ప్రకటించుటకు అప్పగించుట ద్వారా ఎక్కువ ఫలించెను. అట్లే ప్రతి క్రైస్తవుడు దేవుని వాక్యజ్ఞానము నందు అభివృద్ధి జెందుచు, ఆ జ్ఞానమును దేవుని మహిమార్థము ఆచరణలోనికి తేవలెను.

**-ఓ.పి.బైర్డ్**

## క్రైస్తవుడను పేరును బట్టి ఏకమవుదము

క్రీ॥శ॥ 1517లో జాన్ఎడ్‌తో మార్టిన్ లూథర్ వాదించుచు ఇట్లు చెప్పాడు: "మీరు దచేసి నా పేరును ఒకప్రక్కన పెట్టండి. మిమ్మును క్రైస్తవులనే పిలువబడండి గాని లూథరున్లని కాదు. లూథరు ఎవడు? నా బోధ నాది కాదు. నేను ఎవని కొరకును సిలువ వేయబడలేదు. అపొ. పౌలు ఎవడైనను నేను పౌలువాడను లేక పేతురు వాడనని పిలువబడుట ఖండించెను. అట్లు గాక క్రైస్తవుడను మాత్రమే పిలిచెను. పురుగు మంటి వాడనైన నేను నా పేరును దేవుని బిడ్డలకు పెట్టుటకు ఎట్లు సమ్మతింతును? దానినెట్లు సమర్థింతును? గనుక నా మిత్రులారా, పార్టీపేరులను, మనుష్యుల పేరులను విసర్జించుడి, వాటన్నిటిని త్రోసిపుచ్చుడి. అందరము క్రైస్తవులని మాత్రమే పిలువబడదాము. మన బోధ ఆయన నుండి కలుగుచున్నది గనుక ఆయన నామముననే పిలువబడదాము" (Strok, The Life of Luther, Page 289)

మెథడిస్ట సంఘమును స్థాపించిన జాన్‌వెస్లీ అనునతడు క్రొత్త నిబంధన మీద తన వ్యాఖ్యాపుస్తక పరిచయములో "క్రైస్తవులను విభజించు చున్న శాఖలపేర్లు, లేఖన

వ్యతిరేక పదములు మరచి పోవుట మంచిది. తద్వారా ఘనందరము యేసుప్రభువు యొక్క దీన శిష్యులవలె ఆయన యెదుట కూర్చొనుటకు అంగీకరించి ఆయన వాక్యమును వినుచు, ఆయన ఆత్మననుకరించుచు మన జీవితాలను ఆయన జీవితములోనికి మార్చు కొందుము గాక" (1754 పేజీ 5) అని చెప్పాడు.

షికాగోలో ఎపిస్కోపేలియన్ సంఘ బిషప్పు ఏండర్సన్ అనునతడు ఇట్లు చెప్పాడు : దేవుడు కేథలిక్కులను, ప్రొటెస్టాంటులను ఎన్నడు చేయలేదు. ఎపిస్కోపేలియన్లను, ప్రెస్బిటేరియన్ లను, లూథరులను, బాప్టిస్టులను ఎన్నడు చేయలేదు. ఆయన క్రైస్తవులను మాత్రమే చేసాడు. అంతకు మించిన ప్రీతికరమైన నామము ఇంకొకటి యేమిలేదు."

అత్యంత ప్రసిద్ధిగాంచిన బాప్టిస్టు బోధకుడగు చార్ల్స్ స్పర్జన్ అనునతడిట్లు చెప్పాడు: "బాప్టిస్టు అను నామమును గూర్చి యిది చెబుతాను, అది నశించును గాక. క్రైస్తవుడను పేరు నిత్యము నిలుచును గాక. బాప్టిస్టు వాడనేవాడు ఎవడులేని దినము కొరకు నేను సంతోషముతో ఎదురుచూచు చుందును. వారందరు త్వరలో ఇకలేకపోవుదురని నా నిరీక్షణ. బాప్టిస్టు అనే పేరు త్వరలో నశించును గాక. గాని క్రీస్తునామము నిత్యము నిలుచును గాక"! (Spurgeon's Memorial Library Vol.1 Page 168)

బాప్టిస్టు సంఘము యొక్క జనరల్ కన్వెన్షన్‌లో పి.యస్. హెన్‌సన్ అనునతడిట్లు చెప్పాడు : "బాప్టిస్టు అను పేరుకు మా శత్రువులు మాకు ఆపాదించినా అది మాత్రము నిలిచి పోయినది. అందువలన విచారించు చున్నాను. అయినను ఒకానొక దినమందు క్రైస్తవుడు అను పేరుకు తిరిగి వెళ్లుదమనే నిరీక్షణ యున్నది".

మెదడిస్టు సంఘవాఖ్యానకర్త యగు ఆల్బర్ట్ బార్న్సు అనునతడిట్లు చెప్పాడు: " ఈ విభజనలన్నియు పరిశు

ద్ధమైన క్రైస్తవ నామములోనికి కలసిపోవలెను".

అపొ.పౌలు ఇట్లు చెప్పాడు : " మీలో ఒకడు నేను పౌలువాడను, ఒకడు నేను అపోల్లోవాడను, మరి యొకడు నేను కేఫావాడను, ఇంకొకడు నేను క్రీస్తువాడనని చెప్పుకొనుచున్నారని నాతాత్పర్యము. క్రీస్తు విభజింపబడి యున్నాడా ? పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా? పౌలునామమున మీరు బాప్తిస్మము పొందితిరా?" (1 కొరింథీ 1:12-13).

లూకా "అంతియొకయలో శిష్యులు మొట్టమొదట క్రైస్తవులన బడిరి యని" వ్రాసాడు (అపొ.కా. 11:26).

"ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" అని వ్రాసాడు (1 పేతురు 4:16).

మతశాఖల పేర్లు విభజిస్తాయి. క్రీస్తు, క్రైస్తవుడు అనునామము ఏకము చేస్తాయి.

## వెలుగు యేసు దగ్గరకు మార్గము చూపును

తూర్పుదిక్కున ఉదయించిన నక్షత్రమును చూచి జ్ఞానులు యూదుల రాజుగా పుట్టిన వానిని వెదుకుటకు వెళ్లిరని మనందరికీ తెలియును. శాస్త్రులు, ప్రధాన యాజకులు మీకా గ్రంథములోని ప్రవచనమును బట్టి ఆయన బెత్లేహేములో పుట్టునని ఎరుగుదురు. జ్ఞానులకు ముందుండి ఆ నక్షత్రము యేసు జన్మించిన స్థలమునకు నడిపించెను (మత్తయి 2:1-12)

ఒక నక్షత్రమును చూచుట ద్వారా నేడు ప్రజలు యేసును కనుగొనరు. గాని రక్షకుని కనుగొను నిమిత్తము వారు వెలుగును వెంబడించాలి. అపొ.పౌలు ఫిలిప్పీయులకు ఇట్లు తెలియజేసాడు. "మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య

నిరపరాధులును నిష్కళంకులును, అనింద్యులునైన దేవుని కుమారులగు నట్లు సణుగులును, సంశయములను మాని సమస్త కార్యములను చేయుడి. అట్టి జనము మధ్యను మీరు జీవ వాక్యముచేత పట్టుకొని, లోకమందు జ్యోతుల వలె కనబడుచున్నారు" (ఫిలిప్పీ 2:14, 16). జ్యోతులు అను మాటకు వెలుగు యని అర్ధము. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రముల వలె మన వెలుగు దేవుని నుండి కలుగును.

సత్క్రియల ద్వారా మన వెలుగును మనుష్యుల యెదుట కనబరచుచు దేవుని మహిమ పరచాలని యేసు మనలను హెచ్చరించి యున్నారు (మత్తయి 5:14-16).

కొరింథీయులకు క్రీస్తును గూర్చి బోధించుచు పౌలు వారికి పరిచారకుడ నయ్యానని తెలియ జేసాడు. "అంధకారములో నుండి వెలుగు ప్రకాశించును గాక అని పలికిన దేవుడు తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తు నందు వెల్లడి పరచుటకు మా హృదయము లలో ప్రకాశించెను గనుక మేము మమ్మును గూర్చి ప్రకటించు కొనలేదు గాని, క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు మమ్మును గూర్చి, యేసు నిమిత్తము మేము పరిచారకుల మనియు ప్రకటించు చున్నాము" (2 కొరింథీ 4: 5, 6).

పాపపు అంధకారములోబడి నశించి పోవుచున్న ఆత్మలను వెలుగు లోనికి నడిపించుట మన బాధ్యతయై యున్నది. పాపుల కొరకై సిలువ పై బలియైన యేసుక్రీస్తును గూర్చి మనము సువార్త ప్రకటించాలి. మనము కూడ చీకటిలో నుండి విడుదల చేయబడిన వారమని, సత్క్రియల ద్వారా క్రీస్తు వెలుగును ప్రకాశింపజేయుచున్నామని వారు తెలిసికొనినప్పుడు వారు కూడ వెలుగు నొద్దకు నడిపించబడుదురు.

**- గేరి హేంప్టన్**

# సంక్షిప్త వార్తలు

2021 జనవరి 4వ తేదీ సోమవారం నాడు తూర్పుగోదావరి జిల్లా, ఉండేశ్వరపురంలో నూతనముగా నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును రిక్కీగూటం గారు, జాన్ రత్నం గారును రిబ్బను కత్తిరించి దేవుని సేవార్థమై ప్రతిష్టించారు. ఆ రోజు అనేకమంది సువార్తికులు ఆ సంతోష కార్యక్రమములో పాల్గొనిరి. ఉండేశ్వరపురంలో వి. జిమ్ ప్రకాశ్ గారు పలు సంవత్సరములనుండి నిర్విరామకృషి చేయుచున్నారు.

2021 జనవరి 13, 14 తేదీలలో చెన్నైయ్ మహాపట్టణములో రిక్కీగూటం గారి ఆధ్వర్యమున బాలకుల నుండి పాలకులయ్యే వరకు కన్వెన్షన్ నిర్వహించిరి. తమిళనాడులో 14 స్థానిక సంఘముల నుండి వచ్చిన 500 మందికి పైగా యువతీ యువకులు పాల్గొనిరి, పాటలు, బైబిలు క్విజ్, కంఠస్థ వాక్యములు మొదలగు విషయములలో పోటీలు జరుపగా అనేకులు మంచి బహుమతులు గెలుచుకొనిరి. ఇండియా కో ఆర్డినేటర్ రిక్కీ గూటం గారు వాక్యపరిచర్య చేయగా తమిళంలోనికి తర్జుమా చేయబడెను. సహో. జి.పి. శ్యామ్ సుందర్, జి. జె. ప్రభుదాస్ గార్లు కన్వీనర్‌లుగాను, ఉపదేశకులుగాను యుండి సమస్తము సక్రమముగా, ఘనముగా నిర్వహించిరి. దిగువ క్రీస్తు సంఘముల నుండి యువతీ యువకులు పాల్గొనిరి. అయినావరం, కన్నిగపురం, వాడపళని, కస్తూరిబాయి కాలనీ, తాంబరం, సంతోషపురం, చెంగళపట్టు, కీల్‌పాల్ వై.ఎమ్.సి.ఎ., కొల్లపాకం,ఒట్టేరి, కవరపెట్టయ్, చూళై, పాండిచ్చేరి, హనుమాపురం జంక్షన్ మొదలగు సంఘముల నుండి వచ్చిన యువకులు ఆనందోత్సాహములతో పాలుపుచ్చుకొనిరి. సోదరులు ఎస్.మాన్యుయల్ దేవిడ్‌మార్టిన్లు కూడ పాల్గొనిరి.

చెన్నైయ్‌లో జరిగిన్ ఎల్ టు ఎల్ కన్వెన్షన్ కొరకు సోదరులు పి.శ్యామ్‌సుందర్, ప్రభుదాసు గార్లు నిర్విరామకృషి చేసిరి. వారి కృషి సహవాసము అభినందనీయము. రిక్కీ గారి కుమారుడు జస్టిన్ గూటం గారు కూడ చెన్నైయ్ ఎల్ టు ఎల్ లో పాల్గొనిరి.

2021 జనవరి 18, 19 తేదీలలో చింతపల్లిలో బాలకుల నుండి పాలకులయ్యే వరకు కన్వెన్షన్ ఘనముగా జరిగెను. ఇంచుమించు వెయ్యిమంది యువతీ యువకులు పాల్గొనిరి. రిక్కీగూటం గారు తదితరులు వాక్యపరిచర్య చేసిరి. వచ్చిన వారందరికీ బహుమతులు ఇయ్యబడెను. చింతపల్లి ఏరియాలో సోదరులు బి. అలెగ్జాండర్ కేంబెల్ గారు కో ఆర్డినేటర్‌గా పని చేసి గొప్ప విజయము సాధించిరి.

2021 జనవరి 29వ తేదీన రామచంద్రపురం (ఆర్టోస్ కంపెనీ ప్రక్కన యున్న) క్రీస్తు సంఘము సువార్త కూటమును ఘనముగా నిర్వహించిరి. ఆ కూటములో

సోదరులు వి. ప్రసన్న విజయ్ కుమార్ గారు, రిక్కీ గూటం గారు, పి. భాస్కర్ గారు, తదితర్లు వాక్యపరిచర్యచేసిరి. అక్కడ సోదరులు మోజెస్ గారు ఘనముగా సువార్త పరిచర్య చేయుచున్నారు.

జనవరి 29వ తేదీన సాయంత్రం పెద్దాపురం లెప్పర్ కాలనీలో జరిగిన కూటములో రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. ఆ కోలనీ వాస్తవ్యులకు బియ్యము, పప్పు, చింతపండు వగయిరాలు ఉచితముగా సరఫరా చేసిరి. పెద్దాపురం లెప్పర్ కాలనీలో సోదరులు జె. సుధాకర్ గారు మంచి పనిచేయుచున్నారు.

ఇప్పుడే అందిన వార్త : అమెరికాలో సోదరులు రోయస్ ఫ్రెడరిక్ గారు జనవరి 29న ప్రభువునందు నిద్రించిరి. కోవిడ్ వలనను, కాలేయ సమస్యల వలనను ఆయన కొంతకాలము నుండి అనారోగ్యముగా యుండిరి. భారతదేశములో ఆయన చేసిన సువార్త పరిచర్య శ్లాఘనీయము. ముఖ్యముగా వందలాది గ్రామము లలో చర్చి బిల్డింగులు నిర్మించి ఇండియా క్రీస్తుసంఘమును బలపరచిరి. ఆయన విడిచి వెళ్లిన సతీమణి సూజీ గారికి, ఏకైక కుమార్తె జ్యోతిగ్రిఫిన్‌కు దేవుడు ఆదరణ దయచేయును గాక.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2021-2023**

**సత్యవాక్కు**
పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతి నెల 9వ తేదీ
పోస్టు చేయు తేది : ప్రతి నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004